ఎంపీ రవిచంద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రస్ట్ ఆఫ్ పటేల్స్ నిర్వాహకులు

రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుకుసాగాలి

- మంత్రివర్గంలో మున్నూరుకాపులకు చోటుదక్కకపోవడం బాధాకరం
- ట్రస్ట్ ఆఫ్ పటేల్స్ ప్రారంభోత్సవంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, సెప్టెంబర్14(నమస్తే తెలంగాణ): రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుసాగాలని రాజ్యసభ సభ్యుడు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో ట్రస్ట్ ఆఫ్ పటేల్స్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం నగర శివారులోని నాగారాం ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఏపీ, తెలంగాణ మంత్రివర్గంలో మున్నూరుకాపులు లేకపోవడం ఇప్పుడే చూస్తున్నామన్నారు. అసెంబ్లీలోనూ ఎమ్మెల్యేల సంఖ్య తగ్గిందని చెప్పారు. వచ్చే మంత్రివర్గ విస్తరణలో ప్రాతినిధ్యం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రస్ట్ ఆఫ్ పటేల్స్ ఏర్పాటును స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. ఎంపీ నిధుల నుంచి జగిత్యాల జిల్లాకు చెందిన మిచ్చమ్మ ట్రస్ట్, ట్రస్ట్ ఆఫ్ పటేల్స్‌కు రెండు ఆంబులెన్స్‌లు అందజేస్తానని హామీ ఇచ్చారు. మున్నురూకాపు సంఘం అపెక్స్ కోర్ కమిటీ అధ్యక్షుడు రౌతు కనుకయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు సీ విఠల్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డ పెద్దపల్లి జిల్లా మంథని మండలం స్వర్ణపల్లికి చెందిన మానసశ్రీ, వేదాన్ష్

కుక్కల దాడిలో చిన్నారులకు తీవ్ర గాయాలు

మంథని రూరల్, సెప్టెంబర్ 14 : పెద్దపల్లి జిల్లా మంథని మండలం స్వర్ణపల్లిలో పిచ్చి కుక్కలు దాడి చేసి ఐదుగురిని గాయపరిచాయి. వారిలో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన నలుబోతుల మానసశ్రీ(5), కోరవేన వేదాన్ష్(3) ఇండ్ల ముందు ఆడుకుంటుండగా అటుగా వచ్చిన రెండు పిచ్చి కుక్కలు వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు కుక్కలను తరుముతుండగా జిముడ రాజేశ్‌ను కరిచింది. గాయపడ్డ పిల్లలను మంథని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేశారు. అక్కడి నుంచి వెళ్లిన కుక్క వెంకటాపూర్‌లోని గడ్డం మల్లేశ్ కూతురిని కరవగా అడ్డుకోబోయిన మల్లేశ్‌ను కరిచింది. కుక్కల స్వైర విహారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

దక్షిణాదిపై జాతీయ పార్టీల చిన్నచూపు

- రాష్ట్రం నం.1గా ఉన్నా నష్టమే
- కేంద్రం నుంచి తక్కువ నిధులు
- పార్లమెంట్ సీట్లు తగ్గే ప్రమాదం
- టీచర్ల మధ్య తేడా సీఎంకు తగదు
- సిద్దిపేటలో మాజీమంత్రి హరీశ్

సిద్దిపేటలో ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దక్షిణాది రాష్ట్రాలు అంటే కేంద్రానికి, జాతీయ పార్టీలకు చిన్నచూపు అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ, కర్ణాటక, ఏపీ, కేరళ, తమిళనాడు పోటీపడి అభివృద్ధి చెందటం కూడా ఓ విధంగా నష్టం కలిగిస్తున్నదని తెలిపారు. శనివారం సిద్దిపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో జరిగిన గురుపూజోత్సవంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాష్ట్రం నంబర్ వన్‌గా ఉన్నా నష్టాలు ఉన్నాయి. బాగాపనిచేయటం కూడా ఇబ్బందిగా మారుతుంది. ఆర్థికంగా ఫర్ క్యాపిటా ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉండటం వల్ల కేంద్రం నుంచి నిధులు తక్కువగా వస్తాయి. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే సీట్లు తగ్గే ప్రమాదం ఉంటుంది. ఇక్కడి ప్రాంత ఎంపీ సీట్లు తగ్గితే మళ్లీ నార్త్ ఇండియన్ వాళ్లదే కేంద్రంలో పెత్తనం ఉంటుంది. ఇది ఆలోచించాల్సిన అంశం' అని వివరించారు. వెనుకబడిన రాష్ట్రాలకు నిధులు ఇస్తామని కేంద్రం అంటుందని.. అలా బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలకే ఎక్కువ నిధులు వెళ్తాయని వెల్లడించారు. కష్టపడి తెలంగాణను అభివృద్ధి చేసుకుంటున్నామని, తమ నిధులకు తమకు ఇవ్వాలని 16వ ఆర్థిక సంఘం సమావేశంలో తాను చెప్పినట్టు గుర్తుచేశారు. ఎంత సేపు వెనుకబడిన ప్రాంతాల్లో నిధుల కేటాయింపు ఎక్కువగా ఉంటే, తెలంగాణ పరిస్థితి ఎలా? అని ప్రశ్నించానని తెలిపారు.

ప్రైవేట్ టీచర్లను కించపరిచేలా రేవంత్ వ్యాఖ్యలు

'ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్ల మధ్య తేడా చూపి ప్రైవేట్ టీచర్లను తక్కువచేసి మాట్లాడారు. అది దురదృష్టకరం. ఉపాధ్యాయుల అంశంలో సీఎంకు వివక్ష ఉండకూడదు. ప్రభుత్వానికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు రెండు కండ్లు. ప్రైవేట్ ఉపాధ్యాయులు జీతాలు తక్కువ ఉండవచ్చు. కానీ, సామర్థ్యంలో తక్కువేమీ కాదు. ఒకరిని మెచ్చుకునే క్రమంలో ఇంకొకరిని కించపరిచే వ్యాఖ్యలు సీఎం రేవంత్ రెడ్డి స్థాయి మనిషికి తగవు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూసింది. 10 నెలలైనా నిధులు రాలేదు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నిధులు వెంటనే విడుదల చేయాలి. ప్రభుత్వాలు చేయాల్సిన పనిని ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 34.50 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే, సర్కారు పాఠశాలల్లో 25.68 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ పోటీ పెరిగిందని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ట్రస్మా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు సిద్దిపేట జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కృష్ణ (ఫైల్) ఎల్లయ్య (ఫైల్)

కరెంట్ కాటుకు ఇద్దరు రైతులు బలి

- గడ్డి కోస్తుండగా ఒకరు..
- స్టార్టర్ వైర్ తగిలి మరొకరు
- కామారెడ్డి జిల్లాలో విషాదం

నాగిరెడ్డిపేట/రాజంపేట్, సెప్టెంబర్14: కరెంట్ షాక్‌తో ఇద్దరు రైతులు మృతి చెందారు. ఈ ఘటనలు కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట, రాజంపేట్ మండలాల్లో చోటుచేసుకున్నాయి. రాజంపేట్ మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన ముక్కిరి ఎల్లయ్య (41) శనివారం పొలానికి వెళ్లాడు. బోరు చుట్టూ గడ్డి ఏపుగా పెరగడంతో దాన్ని కోస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు కొడవలికి తగలడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు కృష్ణ (40) శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత ఇంట్లో చెప్పి పొలానికి వెళ్లాడు. శనివారం ఉదయం వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో భార్య చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. బంధువులు పొలానికి వెళ్లి చూడగా, కృష్ణ మోటర్ స్టార్టర్ డబ్బా వద్ద కరెంట్ తీగలకు వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు. పొలానికి వెళ్తుండగా, కాలు జారి తీగలపై పడటంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కృష్ణ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు రైళ్లు రద్దు, పలు రైళ్లు దారి మళ్లింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్-నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ల మధ్య రెండు రైళ్లను ఈ నెల 15, 17న రద్దు చేసినట్టు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే పలు రైల్వే స్టేషన్ల మధ్య 8 రైళ్లను దారి మళ్లించినట్టు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

- ఇప్పటికే పీఈటీ జ్యోత్స్న తొలగింపు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 14: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పద్మపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పాఠశాలలో పీఈటీ జ్యోత్స్న వేధింపులతో విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. దీంతో విధుల్లో నిర్లక్ష్యంతో పాటు విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ప్రిన్సిపాల్ పద్మను సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే పీఈటీ జ్యోత్స్నను విధుల్లోంచి తొలగించిన విషయం తెలిసిందే.

తెలంగాణలో రౌడీ రాజ్యం

- రాజ్యాంగాన్ని రక్షిస్తానని రాహుల్ అంటుంటే .. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఖూనీ చేస్తున్నాడు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లి, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రౌడీ రాజ్యం నడుస్తున్నదని, రాజ్యాంగాన్ని రక్షిస్తానని రాహుల్ గాంధీ అంటుంటే రేవంత్‌రెడ్డి మాత్రం ఖూనీ చేస్తున్నాడని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా పార్టీ నాయకురాలు దాసరి ఉషను పోలీసులు హౌజ్ అరెస్టు చేసిన విషయాన్ని తెలుసుకొన్న ఆయన శనివారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. హౌజ్ అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఏ ప్రాంతలోనైనా మంత్రులు పర్యటించే సందర్భంలో సమస్యల పరిష్కారం కోసం నాయకులు, ప్రజలు వినతి పత్రాలు ఇచ్చే సంప్రదాయం ఉంటుందని, కానీ పెద్దపల్లి జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛలేకుండా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అంటే అంత భయమెందుకని ప్రశ్నించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కకు ఆయన పలు ప్రశ్నలను సంధించారు. బడ్జెట్‌లో పెట్టిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిధులు మంజూరు చేశారా? ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2023 డిసెంబర్ తర్వాత ఒక్క లోనైనా ఇచ్చారా? ఈ అంశాలపై చర్చకు సిద్ధమా? హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు తాను సిద్ధమని, భట్టి, రేవంత్ సిద్ధమా? అని సవాల్ విసిరారు.

త్వరలో బీఆర్ఎస్ కీలక సమావేశం

- వారం పదిరోజుల్లో కేసీఆర్ దిశానిర్దేశం!

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన త్వరలో కీలక సమావేశం జరుగనున్నది. రుణమాఫీ, రైతు భరోసా, పంట పరిహారం ప్రశ్నార్థకమైన వేళ.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరోవైపు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా హైడ్రా పేరుతో కొనసాగుతున్న విధ్వంసం.. కాంగ్రెస్ పార్టీ కుట్రవ్యూహాలతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. సర్కారు శాఖల మధ్య, మంత్రుల మధ్య సమన్వయం కొరవడి పాలన అస్తవ్యవస్థమైందనే ఆందోళన వ్యక్తం అవుతున్నది. పుట్టెడు కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలబడాల్సిన అనివార్యత నెలకొన్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ అధినేత కేసీఆర్ వారం పది రోజుల్లో కీలక సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. పార్టీ ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాలు, అన్నిస్థాయిల పార్టీ కేడర్‌తో సమాలోచనలు జరిపి ఉమ్మడి ఉద్యమకార్యాచరణను చేపట్టే పనిలో కేసీఆర్ నిమగ్నం అయ్యారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

తిరుపతిలోని థియేటర్‌లో కత్తిపోట్ల కలకలం

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): ఏపీలోని తిరుపతిలో ఓ థియేటర్‌లో ఓ యువకుడిపై కత్తితో దాడి ఘటన కలకలం రేపింది. తిరుపతి పోలీసుల వివరాల ప్రకారం.. మోహన్‌బాబు యూనివర్సిటీ విద్యార్థి లోకేశ్ ఓ యువతితో కలిసి సినిమా చూసేందుకు తిరుపతిలోని థియేటర్‌కు వెళ్లాడు. సినిమా చూస్తుండగా లోకేశ్ వెనుక సీట్లో కూర్చున్న కార్తీక్ అతడిపై కత్తితో దాడిచేశాడు. అనంతరం లోకేశ్‌తో కలిసివచ్చిన యువతితో పరారయ్యాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే యువతితో కలిసి లోకేశ్‌పై దాడి చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

సౌర విమాన తయారీలో

ముందడుగు

- *10 గంటలు ఎగిరిన చిన్న విహంగం*

బెంగళూరు: ఏకబిగిన 90 రోజులు ప్రయాణించగలిగే సౌర విమానాన్ని భారతీయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా తయారు చేసిన ఓ చిన్న సౌర విమానం విజయవంతంగా 10 గంటలపాటు ఎగిరింది. బెంగళూరులోని నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్ (ఎన్ఏఎల్) దీనిని అభివృద్ధి చేస్తున్నది. ఈ ప్రాజెక్టును హై ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ (హెచ్ఏపీ) అని పిలుస్తున్నారు. ఇది సౌర శక్తితో పని చేస్తుంది. ఇది స్ట్రాటోస్ఫియరిక్ స్థాయిలో స్వయంగా పనిచేసే మానవ రహిత విమానం. 17-20 కిలోమీటర్ల ఎత్తులో ఎగురుతూ, కొన్ని నెలల పాటు పగలు, రాత్రి పని చేసే సామర్థ్యం దీనికి ఉంటుంది. పేలోడ్‌తో ఉండే హెచ్ఏపీని హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ (హెచ్ఏపీఎస్) అని పిలుస్తారు. మరోవైపు బెంగళూరులోని స్టార్టప్ కంపెనీ న్యూ స్పేస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీస్ కూడా 24 గంటల సామర్థ్యం గల ఇలాంటి ఓ సౌర విమానాన్ని అభివృద్ధి చేసింది.

- 32 ఏండ్లుగా ఈ ఊరికి ఒకే వినాయకుడు!

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం సూరంపేట గ్రామం ఐక్యతను చాటుతున్నది. ఆ ఊళ్లో 32 ఏండ్లుగా ఏటా ఒకే వినాయకుడిని ప్రతిష్ఠించి పూజిస్తుండటం ఇందుకు నిదర్శనం. సూరంపేట జనాభా 600 కాగా, 500కుపైగా ఓటర్లున్నారు. ఎనిమిది వార్డులున్నాయి. ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాలను ఊరి బయట ఉన్న హనుమాన్ దేవాలయంలో నిర్వహిస్తారు. ఒకే వినాయకుడిని ప్రతిష్ఠించి ఘనంగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. - శాయంపేట

భర్తను చంపిన భార్య

- విద్యుత్తు షాక్‌తో మృతి చెందినట్టు చిత్రీకరణ
- అనుమానంతో చితకబాదిన కుటుంబసభ్యులు
- నలుగురితో కలిసి హత్య చేయించినట్టు వెల్లడి
- మల్దకల్‌లో మృతదేహంతో రాస్తారోకో

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో బోయ చిన్న నర్సింహులు మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, మద్దెలబండ గ్రామస్థులు

మల్దకల్, సెప్టెంబర్ 14: నలుగురు వ్యక్తులతో కలిసి భర్తను చంపించింది ఓ భార్య. అంతే కాదు.. విద్యుత్తు షాక్‌తో మృతి చెందినట్టు చిత్రీకరించేందుకు యత్నించింది. దీంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు ఆమెను చితకబాదడంతో నిజాన్ని ఒప్పుకున్నది. ఈ ఘటన శనివారం జోగుళాంబ గద్వాల జిల్లాలో వెలుగుచూసింది. జోగుళాంబ గద్వాల జిల్లా మద్దెలబండకు చెందిన బోయ చిన్న నర్సింహులు (40) శుక్రవారం పొలం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ విషయంపై తండ్రి పెద్ద నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నర్సింహులు శరీరంపై దెబ్బలు ఉండటంతో తల్లిదండ్రులు, బంధువులకు అనుమానం వచ్చి.. మృతుడి భార్య పద్మను శనివారం ఉదయం నిలదీశారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో చితకబాదారు. దెబ్బలు తాళలేక అసలు నిజం చెప్పింది. గ్రామానికి చెందిన దుబ్బన్నతోపాటు గట్టు మండలంలోని రాయపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులతో కలిసి భర్తను హత్య చేయించినట్టు అంగీకరించింది. ముందుగా అనుమానాస్పద మృతిగా.. తర్వాత విద్యుదాఘాతంతో నర్సింహులు మృతి చెందినట్టు ఏఎస్సై ఈశ్వరయ్య కేసు నమోదుకు యత్నించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు మృతదేహాన్ని తీసుకొచ్చి మల్దకల్ బస్టాండ్ వద్ద రోడ్డుపై ఉంచి రాస్తారోకో చేపట్టారు. కొందరు కావాలనే హత్య చేశారని, వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హత్య చేసిన వారిని అరెస్టు చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని పెట్రోల్ బాటిళ్లతో కొందరు బంధువులు హెచ్చరించారు. దాదాపు ఐదు గంటలపాటు ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న సీఐ నాగేశ్వర్‌రెడ్డి అక్కడికి వచ్చి వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. గ్రామస్థులు, కుటుంబీకులు తెలిపిన అనుమానితుల పేర్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసి, అందరికీ శిక్ష పడేలా చూస్తామని ఏఎస్పీ గుణశేఖర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

'పొరపాటున మీకు డబ్బు లొచ్చాయ్..'

- కొత్తరకం మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, సైబర్ సెక్యూరిటీ అధికారుల సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): 'సార్.. క్షమించాలి. మీ అకౌంట్‌కు పొరపాటున 5వేల రూపాయలు గూగుల్ పే చేశాను.. దయచేసి తిరిగి పంపగలరు? ప్లీజ్..' అంటూ వచ్చే మెసేజ్, కాల్స్‌కు స్పందించొద్దని పోలీసులు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు సూచిస్తున్నారు. కొత్త ఎత్తుగడల్లో భాగంగానే సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వారి మాటలు నిజమేనని నమ్మి డబ్బులు పోగొట్టుకున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శనివారం ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

వరద సహాయక చర్యలపై సర్కారు దృష్టి

- ఇప్పటికే సాయం కోసం కేంద్రానికి నివేదిక

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో అపారం నష్టం జరిగిన నేపథ్యంలో వరద సహాయక చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దెబ్బతిన్న కాలువలు, చెరువులు, పంప్‌హౌస్‌లు, చెక్‌డ్యామ్‌లను పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఇప్పటికే కేంద్రాన్ని సాయం కోసం అర్థించింది. చెరువులు, కాలువల తాత్కాలిక మరమ్మతులకు రూ.75 కోట్లు, శాశ్వత పునరుద్ధణకు రూ.483 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేసింది. కుండపోత వర్షంతో ఖమ్మం, సూర్యాపేట, ములుగు, మహబూబాబాద్, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో అధిక నష్టం సంభవించినట్లు గుర్తించింది. ఈ ప్రాంతాలతో పాటు 773 చెరువులు, కాలువలు కోతకు గురయ్యాయని అంచనావేసి పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నది. ఆదివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పర్యటించి పునరుద్ధరణ పనులను పరిశీలించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

పౌరహక్కుల నేతల అరెస్ట్

- రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ ప్రాంతానికి వెళ్తుండగా అదుపులోకి..
- వెంటనే విడుదల చేయాలి : టీపీఎఫ్ డిమాండ్

మణుగూరులో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అశ్వాపురం/సారపాక, సెప్టెంబర్ 14 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు శనివారం బస్సులో వెళ్తున్న పౌరహక్కుల సంఘం నేతలను మణుగూరు పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కరకగూడెం మండలం రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో ఈ నెల 5న గ్రేహౌండ్స్ బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై నిజనిర్ధారణ చేపట్టేందుకు పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి నారాయణతోపాటు మరో 14 మంది ఘటనా స్థలం వద్దకు వెళ్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అక్కడికి వెళ్లనీయకుండా మణుగూరులో అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మణుగూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మీడియాకు విషయం తెలియడంతో అక్కడి నుంచి వారిని అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. పౌరహక్కుల సంఘం నేతలతో మాట్లాడేందుకు యత్నించిన మీడియాను కూడా స్టేషన్ లోపలికి అనుమతించకపోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. దీంతో పరిస్థితిని అదుపుచేసేందుకు పోలీసులు అరెస్ట్ చేసిన పౌరహక్కుల సంఘం నేతలను తిరిగి బస్సులో ఎక్కించి అశ్వాపురం నుంచి కొత్తగూడెం వైపు తీసుకెళ్లారు. వారిని ఎక్కడికి తీసుకెళ్తున్నారని ప్రశ్నించిన మీడియాకు.. వివరాలు చెప్పేందుకు సీఐ అశోక్‌రెడ్డి నిరాకరించారు.

హక్కుల నేతలను విడుదల చేయాలి : టీపీఎఫ్

పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులను మణుగూరు పోలీసులు నిర్బంధించడాన్ని ప్రజాఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, కోకన్వీనర్ మంతెన సంజీవరావు ఒక ప్రకటనలో ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిజనిర్ధారణకు వెళ్తున్న వారిని ఆపడం అంటే.. వాస్తవాలు బయటకు రాకుండా చేయడమేనని, నిజమైన ఎన్‌కౌంటర్ అయితే బృందాన్ని ఆ ప్రాంతానికి అనుమతించాలని డిమాండ్ చేశారు.

- వలకు చిక్కిన కొండ చిలువ

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి పాత చెరువులో శనివారం చేపల వలకు భారీ కొండ చిలువ చిక్కింది. బొడిగ శివకుమార్ చేపల కోసం శుక్రవారం సాయంత్రం వల పెట్టాడు. శనివారం ఉదయం అక్కడికి వెళ్లి చూడగా కొండ చిలువ వలకు చిక్కి ఒడ్డుకు చేరింది. - అక్కన్నపేట